

అశ్వాపురం:విజయలక్ష్మికి గులాబీ కండువా కప్పుతున్న రేగా కాంతారావు



మణుగూరు టౌన్: గురిజాల గోపిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న రేగా కాంతారావు

# కేసీఆర్ అంటే.. ప్రజలందరికీ నమ్మకం.. ధీమా

## బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు

మణుగూరు టౌన్, నవంబర్ 20: ''సీఎం కేసీఆర్ అంటే.. తెలంగాణ ప్రజలకు ఒక నమ్మకం. ఒక ధీమా. ఆయన చెప్పింది చేస్తారన్నది ప్రజల నమ్మకం. ఆయన పాలనలో తమకు ఏ కష్టమూ రాదన్నది ప్రజల ధీమా. అందుకే, ఈసారి కూడా బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించబోతున్నారు. కేసీఆర్‌ను సీఎంగా చూడబోతున్నారు'' అని, బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్, మణుగూరు మండల అధ్యక్షుడు గురిజాల గోపి ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన 1,500 కుటుంబాల వారు సోమవారం రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రేగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శంచారు. కర్నాటక రాష్ట్ర ప్రజలను కూడా ఆ పార్టీ ఇలాగే ఏవేవో హామీలిచ్చి విస్మరించిందని, అక్కడి ప్రజలను దారుణంగా మోసగించిందని చెప్పారు. అందుకే, ఆ పార్టీని దూరం పెట్టాలని తెలంగాణ ప్రజలు ఇప్పటికే నిశ్చయించుకున్నారని అన్నారు. పినపాక నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కారు గుర్తుకే ఓటేయాలని కోరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో అశ్వాపురం ఎంపీటీసీ సభ్యురాలు పోరెడ్డి విజయలక్ష్మి, నాయకులు కిషన్ నాయక్, కొండబాబు, లక్ష్మయ్య, రవి, శేఖర్, కృష్ణవంశీ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌ను నమ్మితే.. నట్టేట మునిగినట్టే

మణుగూరు టౌన్, నవంబర్ 20: కాంగ్రెస్ పార్టీని నమ్మితే.. నట్టేట మునిగినట్టేనని బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. ఆయన సోమవారం మణుగూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ను నడిపించిన ఆ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు, పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ గురిజాల గోపికి అధిష్టానం వెన్నుపోటు పొడిచిందన్నారు. ఆ పార్టీలోని నాయకులకు భవిష్యత్తు లేదన్నారు. అందుకే, గోపి ఆధ్వర్యంలో 1,500 కుటుంబాల వారు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పారు. బీఆర్ఎస్‌లో పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని అన్నారు. పార్టీ నాయకులు-ప్రజాప్రతినిధులు పోశం నర్సింహారావు, ముత్యంబాబు, కుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం, నవంబర్ 20: మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, ఎంపీటీసీ సభ్యురాలు పోరెడ్డి విజయలక్ష్మి సోమవారం రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గవ్యాప్తంగా రేగా చేస్తున్న అభివృద్ధిని, కేసీర్ ప్రభుత్వ సంక్షేమ పాలనను చూసి ఆ పార్టీలో చేరినట్లు చెప్పారు.

### ఇంటింటి ప్రచారం

మణుగూరు టౌన్, నవంబర్ 20: బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావును గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం మండలంలోని రామానుజవరం, మిట్టగూడెం, ముత్యాలమ్మనగర్ పంచాయతీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని సమితిసింగారం, శేషగిరి నగర్ గ్రామాల్లో జరిగిన ప్రచారంలో నాయకులు బుద్దరాజు నవీన్‌బాబు, అడపా అప్పారావు, వేముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సారపాక, నవంబర్ 20: రేగా కాంతారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఉపాధి కూలీలను కోరారు. ప్రభుత్వ పథకాలను, మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మణుగూరు టౌన్: రామానుజవరం పంచాయతీలో ప్రచారం



మణుగూరు టౌన్: మిట్టగూడెంలో ప్రచారం



మణుగూరు టౌన్: ముత్యాలమ్మ నగర్‌లో నాయకుల ప్రచారం



మణుగూరు టౌన్: సమితిసింగారంలో ప్రచారం



మణుగూరు టౌన్: శేషగిరినగర్‌లో ప్రచారం



సారపాక: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

## నేడు, రేపు ఇంటి వద్దనే ఓటింగ్

అశ్వారావుపేట, నవంబర్ 20: వయోవృద్ధులు (80 ఏళ్లు దాటినవారు), దివ్యాంగులు మంగళ, బుధవారాల్లో తమ ఇంటి వద్దనే ఓటు వేయవచ్చని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ పి.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాలట్ ఓటింగ్‌కు 174 మంది దరఖాస్తు చేసినట్లు పేర్కొన్నారు. వీరి ఇళ్ల వద్దకు మంగళ, బుధవారాల్లో పోలింగ్ సిబ్బంది వెళ్లి ఓటు వేయిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన వారంతా ఈ రెండు రోజులు తమ ఇళ్ల వద్ద ఎన్నికల సిబ్బందికి అందుబాటులో ఉండాలని కోరారు.

## మావోయిస్ట్ పార్టీ పోస్టర్లు

గుండాల, నవంబర్ 20: మండలంలోని పోతురెడ్డిగూడెం వద్ద బ్రిడ్జి, గలబ గ్రామ సెంటర్ వద్ద సోమవారం మావోయిస్ట్ పార్టీ ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటి పేరిట పోస్టర్లు కనిపించాయి. పీఎల్‌జీఏ వార్షికోత్సవాలను విజయవంతం చేద్దాంమని, బూటకపు ఎన్‌కౌంటర్లకు-అభివృద్ధికి వ్యతిరేకంగా పోరాడదామని.. తదితర అంశాలు వాటిలో ఉన్నాయి.

## కార్తీక సోమవారం పూజలు

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 20: స్థానిక భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు సోమవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు, ధూపదీప నైవేద్యాలు, మహానివేదన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక పూజలు చేసి, జ్యోతులను వెలిగించారు.

## ఓటర్ స్లిప్పుల పంపిణీ

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 20: పట్టణంలోని ఓటర్లకు స్లిప్పులను బూత్ లెవల్ అధికారులు సోమవారం ఇంటింటికీ వెళ్లి ఇచ్చారు. ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు.

## ఓటు వినియోగంపై పాఠశాలల్లో ప్రదర్శనలు

చింతకాని, నవంబర్ 20 : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. జాతీయ ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు నాగులవంచ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓటు ఆకారంలో కూర్చుని ఓటు హక్కువినియోగంపై గ్రామస్తులకు అవగాహన పరచారు. అనంతరం ఉపాధ్యాయులు, అధికారులు విద్యార్థులతో కలసి ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమాల్లో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు భాగవతుల వెంకటేశ్వరశర్మ, కనపర్తి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముమ్మర తనిఖీలు

బోనకల్లు, నవంబర్ 20: బోనకల్లు చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రా వైపు నుంచి తెలంగాణకు వస్తున్న ద్విచక్ర వాహనంలో రూ.79,290, మహీంద్ర వెహికల్‌లో రూ.75,800 నగదును పట్టుకున్నారు. ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశారు.

## సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించాలని పూజలు

చింతకాని, నవంబర్ 20 : ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన మాలధారులు జరగనున్న ఎన్నికల్లో గెలిచి కేసీఆర్ మూడోసారి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలంటూ అయ్యప్ప స్వామి వారి సన్నిధానంలో ఇరుముడితో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాంబాబు

## 'మరక మంచిదే' ఆవిష్కరణ

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 20: 'ఓటు చైతన్యం' అంశంపై ప్రముఖ కవి డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు సంపాదకత్వంలో విద్యార్థులు కవితలు రాశారు. వీటిని 'మరక మంచిదే' పేరుతో పుస్తకంగా ప్రభాకరాచార్యులు ముద్రించారు. దీనిని సోమవారం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గణేష్, అడిషనల్ కలెక్టర్ పి.రాంబాబు తహసీల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

చింతకాని, నవంబర్ 20 : రేపల్లెవాడ, రామకృష్ణాపురం, అనంతసాగర్, ప్రొద్దుటూరు, పాతర్లపాడు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారులు సోమవారం సందర్శించారు. వారు పోలింగ్ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలు, మౌళిక వసతులు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. వారు మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా పనిచేయాలని సూచించారు. తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శులు డేగల సురేశ్, కమల ప్రణీత, వల్లంకొండ మురళి తదితరులు పాల్గొన్నారు.